క్లుప్తంగా

ఉత్సాహంగా విజిలెన్స్ వారోత్సవాలు



విజిలెన్స్ వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది

బాలాజీచెరువు: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని యూనియన్ రీజనల్ బ్యాంక్ కార్యాలయం నుంచి స్థానిక వివేకానంద పార్కు వరకూ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. విజిలెన్స్ వారోత్సవాలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా గ్రామ సభ, అవగాహన సదస్సులు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, అవినీతి నిర్మూలన ఆవశ్యకతపై అవగాహన కల్పించి విజేతలకు బహుమతులు అందిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ బీజీఆర్ నాయుడు తెలిపారు. విజిలెన్స్ అధికారి వెంకటరమణారావు, ఏపీ యూబీఓఎ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల సాంబశివరావు, రీజనల్ కార్యదర్శి చంద్రశేఖర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

42, 48 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించాలి



42, 48 డివిజన్లకు ఎన్నిక నిర్వహించాలని డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

బోట్‌క్లబ్: ఎన్నికలు నిర్వహించాలని 42, 48 డివిజన్లకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. కార్పొషన్‌లో విలీనం చేస్తే డివిజన్ ఎన్నికలు, విలీనం చేయకపోతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శనివారం డీఆర్వో తిప్పేనాయక్కు వినతి పత్రం అందజేశారు. స్థానిక ప్రజా సంఘాల నాయకుడు పెదపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జనన మరణ, ఆధార్, కరెంట్, భూమి రిజిస్ట్రేషన్, ఆస్తి పన్ను నీటి పన్ను వంటి సమస్తం ప్రభుత్వ రికార్డులు యావత్తు నగర పాలక సంస్థ పరిధిలో పదేళ్లుగా జరుగుతున్నాయన్నారు. రూ.కోట్లు మున్సిపల్ పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ 42, 48 డివిజన్లను నగర పరిధి కాదన్నట్టుగా అనాథగా వదిలివేయడం దారుణమన్నారు. పదేళ్లుగా వసూలు చేసిన పన్నులు వెనక్కి ఇచ్చి పంచాయతీ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు మద్దతు తెలిపారు.

పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



గొర్రిపూడిలో నేలకొరిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు

కరప: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటల రక్షణకు రైతులు తగిన జాగ్రత్తల తీసుకుంటే కొంతవరకు నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు సూచించారు. ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయ విద్యార్థులతో కలిసి శాస్త్రవేత్తలు అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాలైన మండల పరిధిలోని నడకుదురు, పెనుగుదురు, గొర్రిపూడి గ్రామాల్లో పర్యటించి, నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడి పంట పరిస్థితిని, నేలలో తేమ శాతం, నీటి నిల్వ, వరి కంకుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొలాల్లో అధికంగా నిల్వ ఉన్న నీటిని పిల్ల కాలువలు ఏర్పాటుచేసి, వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. పంట పరిస్థితి ఆధారంగా, వ్యవసాయాధికారుల సూచనల మేరకు 5 శాతం ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల గింజ మొలకెత్తకుండా, రంగుమారకుండా నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీలీటరు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పుస్తకాల ద్వారా నేర్చుకున్న వ్యవసాయ పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా రైతుల పొలాల్లో పరిశీలించడం ద్వారా పంట సమస్యలను గుర్తించడం, వాటికి శాస్త్రీయ పరిష్కారాలు సూచించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు దక్షిణామూర్తి, సీతారామశర్మ, రామభద్రరాజు, సుజాత, బిందుప్రవీణ, ఎంఏఓ సత్య పాల్గొన్నారు.

చివరిలో కష్టాలు!

- సార్వా పంట చేతికొచ్చే దశలో నిండాముంచిన తుపాను
- వరద నీటిలో నానుతున్న వరిచేలు
- ముంపుబారిన 12 వేల ఎకరాలు
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా కోసం రైతుల ఎదురుచూపు



వలసపాకలలో నీటిలో నానుతున్న వరి పైరు



వేములవాడలో నేలనంటిన వరి చేను

కరప: అల్పపీడనం, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుపాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలు రైతులను నిండా ముంచాయి. సార్వా సీజన్ చివరి దశలో వదలని వరస తుపాన్లు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. అధిక వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. సెప్టెంబరు చివరిలో తీవ్ర వాయుగుండం, అక్టోబరులో వచ్చిన అర్నబ్ తుపాన్లకు విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా చేతికి అందివచ్చిన పంట నీటి పాలైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలకు పంట దెబ్బతిందని, పెట్టుబడులు దక్కవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎగువ ప్రాంతాల నుంచి ముంపునీరు

కరప మండలంలోని భూములన్నీ కాలువలకు శివారున, సముద్ర తీరానికి చేరువన ఉంటాయి. పొలాలన్నీ సాగునీటి ప్రవాహానికి శివారున, ప్రకృతి వైపరీత్యాలకు ముందుంటాయని స్థానిక రైతులు అంటున్నారు. కరప మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కరప, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, వలసపాకల, కూరాడ, వేళంగి, జి.భావారం, యండమూరు, విజయరాయుడుపాలెం, వేములవాడ, వాకాడ, అరట్లకట్ట, నడకుదురు, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లోని వరి పంట ముంపునకు గురైనట్టు అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ప్రతి ఎకరాలోని వరి పంట దెబ్బతిందని, ప్రభుత్వం సాయమందించి ఆదుకోకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోతామని రైతులు పేర్కొంటున్నారు. మరో రెండువేల ఎకరాల్లో వరి చేలు సెప్టెంబరులో వచ్చిన తుపానుకు వీచిన ఈదురుగాలులకు నేలనంటాయని తెలిపారు. విత్తనాల కోసం వేసిన వరి పంట కోతకు రాగా, ఆలశ్యంగా నాట్లు వేసిన పొలాలు ఈనిక దశలో, ముందుగా ఊడ్చిన చేలు పాలు పోసుకుని పక్వ దశలో ఉన్నాయి. ఈదురుగాలులకు పంట పొలాలు నేలనంటగా, వర్షం నీటికి ముంపునకు గురయ్యాయి. దీనికి తోడు కరప మండలం సముద్ర తీరానికి ఆనుకుని ఉండటం వల్ల ఎగువ ప్రాంతాల్లోని అయిదారు మండలాల నుంచి ముంపునీరు వచ్చి చేరుతుండటంతో ఇక్కడి పంట పొలాలకు ముంపు బెడద ఎక్కువైంది.

మరో వాయు'గండం'

కోతకు వచ్చిన విత్తనాల వరి పడిపోవడం వల్ల నీటిలోనానిపోయి మొలక శాతం దెబ్బతింటుందని రైతులు అంటున్నారు. ఈనిక దశలో ఉన్న వరిచేలు పడిపోవడం వల్ల పాలుపోసుకోక తాలు గింజలుగా మారి దిగుబడులు తగ్గిపోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలు పోసుకున్న వరి చేలు మునిగిపోతే గింజ గట్టిపడక మడమ పొల్లు వస్తుందని రైతులు తెలిపారు. పత్ర చేలు, పల్లపు ప్రాంతల్లోని పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో వరి దుబ్బులు కుళ్లిపోయి ఎకరానికి 5 బస్తాలకు పైగా దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. అప్పులు చేసి ఇప్పటికే ఎకరానికి రూ.26 నుంచి రూ.28 వేల వరకు పెట్టుబడులు పెట్టాం. వాతావరణ శాఖ మళ్లీ తీవ్ర వాయుగుండం హెచ్చరికలు చేస్తుండటంతో రైతులు చిగురుటాకులా వణికిపోతున్నారు. భారీ వర్షాలు వస్తే పెట్టుబడులు మాట దేవుడెరుగు, తిండిగింజలూ దక్కవని రైతులు అంటున్నారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు, పంటలబీమా వర్తింపచేసి, ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు కోరుకుంటున్నారు.

పొల్లుగింజలుగా మారుతాయి



తొలకరి పంట పాలు పోసుకుంటూ, గింజ గట్టిపడే దశలో ఉంది. ఈదురుగాలులకు, వర్షాలకు వరిచేలు చాపలా పడిపోయి, ముంపునీటిలో నానుతున్నాయి. దీనివల్ల పొల్లు గింజలుగా మారుతాయి. పెట్టుబడులు వచ్చేట్టుగా లేదు. ప్రతి సీజన్‌లో తుపాన్లు వస్తే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి రైతులకు భరోసా ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– బందే వీరబాబు, రైతు, వేములవాడ

కౌలు రైతులను ఆదుకోవాలి



తొలకరిలో 2.50 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. పంట బాగుందనుకున్న సమయంలో కురిసిన భారీ వర్షాలు నిండా ముంచేశాయి.ఈదురు గాలులకు చేలు పడిపోయి, నేలనంటాయి. అధిక వర్షాలకు పంట పొలాలు నీటమునిగి, పంట పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడులకు చేసిన అప్పుల తీరేటట్టుగా లేదు. అధికారులు స్పందించి బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– వెలుగుబంటి సీతారామరాఘవ,
రైతు, మాజీ సర్పంచ్, విజయరాయుడుపాలెం

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం



మండల పరిధిలో తుపాన్ల కారణంగా కురిసిన వర్షాలకు, గాలులకు ప్రాథమిక అంచనాల ప్రకారం 12 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అర్నబ్ తుపాను కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పంటలకు నష్టం ఏర్పడింది. పూర్తి స్థాయిలో సర్వే జరిపి పంట నష్టాన్ని గుర్తించి, ప్రభుత్వానికి నివేదిస్తాం.

– ఇమ్మిడిశెట్టి సత్య, ఎంఏఓ, కరప మండలం

చంద్రబాబు నిర్వాకంతోనే బియ్యం ధరలకు రెక్కలు



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు జెడ్పీటీసీ అభ్యర్థి గోపుశెట్టి పద్మజ

కాకినాడ రూరల్: చంద్రబాబు నిర్వాకంతోనే బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని, కిలో బియ్యం రూ.85 నుంచి రూ.100 వరకు పలకడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆక్షేపించారు. కొవ్వూరు, తిమ్మాపురంలో శనివారం జెడ్పీటీసీ అభ్యర్థి గోపుశెట్టి పద్మజ, కొవ్వూరు ఎంపీటీసీ అభ్యర్థులు దేవిశెట్టి శారదాదేవి, సాధనాల సత్తిబాబు, తిమ్మాపురం ఎంపీటీసీ అభ్యర్థులు పెదపూడి రామారావు, సారిపల్లి గంగాభవానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

సామాన్యులు ఇబ్బంది పడేలా బియ్యంతో పాటు నిత్యావరసన సరకుల ధరలు ఆకాన్నంటాయని అన్నారు. సామాన్య, పేద వర్గాల ప్రజలు పెరిగిన ధరలతో అల్లాడుతున్నారని, కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణకు ఏం చేస్తోందని కన్నబాబు నిలదీశారు. రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, సూపర్ సిక్స్ అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డలకు ప్రతినెల రూ.1,500, నిరుద్యోగ భృతి, ఉచిత పంట బీమా పథకాలను విస్మరించి అన్ని రకాలుగా ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని కన్నబాబు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు విజయం అందించాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో అమలు చేసిన పథకాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కన్నబాబు కోరారు.

బీసీలకు ఎమ్మెల్యే కొండబాబు వెన్నుపోటు



మాట్లాడుతున్న జగ్గారపు మల్లికార్జున

బోట్‌క్లబ్: కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు బీసీలకు వెన్నుపోటు పొడుస్తూ కాకినాడను భ్రష్టు పట్టిస్తున్నారని, కూటమి పాలనలో అవినీతి పరాకాష్టకు చేరిందని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లికార్జున విమర్శించారు. కీలక పదవులు తమ కుటుంబ సభ్యులకు కేటాయించుకుని మిగిలిన బీసీలను రాజకీయంగా ఎదగకుండా కొండబాబు వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. స్థానిక భానుగుడి వద్ద నున్న పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కొండబాబుకు వియ్యంకుడైన జాబు రామకృష్ణ కాకినాడకు సంబంధం లేని తన కోడలికి మేయర్ సీటు కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ పదవులను ఆశించాలని, అలా కాకుండా డబ్బు ఉందని, పదవులను కొనేస్తాం అంటే కాకినాడ ప్రజలు చూస్తూ ఊరుకునే పరిస్థితిలో లేరన్నారు. ఎమ్మెల్యే కొండబాబు, జాగు రామకృష్ణ ఇద్దరూ కలిసి కాకినాడ నగరాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. జాగు హరిక తనకు సోదరితో సమానమని, ఈరోజు వరకు ఏ పార్టీ సభ్యత్వం లేని ఆమె ప్రజాక్షేత్రంలో లేకుండా మేయర్ పదవి ఆశించడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే పదవి అడ్డు పెట్టుకుని మేయర్ పదవి సంపాదించి దండుకోవాలని ఎమ్మెల్యే కొండబాబు చూస్తున్నారని, నిరుపేదలకు న్యాయం చేయటం లేదన్నారు. జాగు హరికకు మేయర్ పదవి కేటాయిస్తే ఓడించి తీరుతామన్నారు. బీసీల్లో అనేక ఉప కులాలు ఉన్నాయని శెట్టిబలిజ, పద్మశాలి, యాదవ్, అగ్నికుల క్షత్రియులు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కులాలు ఉన్నాయని, వాటిని కాకుండా ఇద్దరు వ్యక్తులు మాత్రమే కాకినాడలో రాజకీయం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు

66 వార్డులకు తుది రిజర్వేషన్లు ప్రకటించిన కలెక్టర్



కాకినాడ లీగల్: నగరపాలక సంస్థలో జరగనున్న రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ తుది నోటిఫికేషన్ జారీ చేశారు. శనివారం రెవెన్యూ శాఖ ద్వారా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 66 వార్డులకు వివిధ సామాజిక వర్గాలు, మహిళలు, జనరల్ కేటగిరీలకు రిజర్వేషన్లు కేటాయించారు. నోటిఫికేషన్ ప్రకారం ఎస్టీలకు ఒక వార్డు కేటాయించగా, ఎస్సీలకు ఆరు వార్డులు కేటాయించారు. వీటిలో ఎస్సీ మహిళలకు 3, జనరల్ ఎస్సీలకు 3 వార్డులు కేటాయించారు. బీసీలకు మొత్తం 26 వార్డులు కేటాయించగా, అందులో బీసీ మహిళలకు 13, జనరల్ బీసీలకు 13 వార్డులు కేటాయించారు. మహిళలకు (జనరల్) 17 వార్డులు కేటాయించారు. మిగిలిన 16 వార్డులను అన్‌రిజర్వుడ్ కేటగిరీలో ఉంచారు. ఎస్టీలకు కేటాయించిన ఒక వార్డు జనరల్ కేటగిరీలో ఉంది.

వార్డుల రిజర్వేషన్ల వివరాలు

8వ వార్డు (ఎస్టీ జనరల్–1), 42, 43, 50 (ఎస్సీ మహిళలు–3), 9, 30, 57 (ఎస్సీ జనరల్–3), 12, 13, 14, 15, 19, 20, 21, 23, 24, 31, 35, 45, 49 (బీసీ మహిళలు–13), 1, 4, 16, 17, 18, 22, 25, 26, 28, 34, 37, 40, 44 (బీసీ జనరల్–13), 5, 6, 7, 10, 27, 29, 32, 38, 39, 46, 47, 51, 52, 54, 55, 58, 61 (జనరల్ మహిళలు–17), 2, 3, 11, 33, 36, 41, 48, 53, 56, 59, 60, 62, 63, 64, 65, 66 (అన్‌రిజర్వుడ్–16) కేటాయించారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, రిజర్వేషన్ల నిబంధనలకు అనుగుణంగా ఈ తుది రిజర్వేషన్లను ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థలో 66 వార్డుల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది.

దేశ ఐక్యతకు సర్దార్ పటేల్ విశేష కృషి



సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థిని



ఏపీఎస్పీ బెటాలియన్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ నవీన్‌కుమార్, సిబ్బంది

బాలాజీచెరువు: దేశ ఐక్యతకు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని లక్ష్య స్కూల్ డైరక్టర్ ఎన్.సుగుణారెడ్డి పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని, సమైఖ్యతవాది, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణారెడ్డి మాట్లాడుతూ సంస్థానాల విలీనానికి, కాశ్మీర్, హైదరాబాద్ మన దేశంలో కలిసి ఉండటానికి పటేల్ కృషి చేశారన్నారు. దేశ ఐక్యతతో పాటు సమగ్రత కోసం ఆయన చూపిన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ వందనబోప్రా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతకు ప్రతీక వల్లభాయ్ పటేల్

కాకినాడ రూరల్: దేశ సమైక్యతకు, సమగ్రతకు ప్రతీక ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ కె.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఏపీఎస్పీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమానికి జెండా ఊపి ప్రారంభించారు. అచ్చంపేట జంక్షన్ నుంచి బెటాలియన్ వరకు ఉత్సాహం రన్ నిర్వహించారు. సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, గంగరాజు, చంద్రశేఖర్, మోహనరావు, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, రవిశంకర్, ఏఓ మోహనరావు పాల్గొన్నారు.

పటేల్ సేవలు ఎనలేనివి

బోట్‌క్లబ్: భారత తొలి ఉప ప్రధాని, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను ఎనలేనివని రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ వక్కలంక రామకృష్ణ అన్నారు. స్థానిక రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో శనివారం వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సతీష్, కరస్పాండెంట్ శర్మ పాల్గొన్నారు.

శతాధిక సంస్థల సభ్యులకు నేడు సత్కారం

బోట్‌క్లబ్: వందేళ్లుగా ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ సామాజిక అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా సేవలందిస్తోందని ఈ నేపథ్యంలో ఆదివారం శతాధిక సంస్థలకు అభినందన సత్కారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎంవీ భారత లక్ష్మీ శనివారం తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు స్థానిక ప్రతాప్‌నగర్ రెడ్ క్రాస్ స్కిల్ సెంటర్ భవనంలో ఏర్పాటయ్యే ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ అధ్యక్షుడు బి.పద్మావతి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా శతాధిక సంస్థలకు సేవలందిస్తున్న ముత్తా లక్ష్మీ, పెద్దాడ సూర్యకుమారి, ఎంవీ రాఘవరావు, కె. పుల్లారావు, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, వై బుజ్జిని సత్కరిస్తామన్నారు.

స్థానిక పోరు.. ప్రచారంలో అభ్యర్థుల జోరు



కొవ్వూరులో జెడ్పీటీసీ అభ్యర్థిని గోపుశెట్టి పద్మజ, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు



తిమ్మాపురంలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచారం

- అభ్యర్థులతో కలిసి వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటరు కన్నబాబు ప్రచారం

ప్రచార పర్వం

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల పర్వంలో ముందుకు దూసుకుపోతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ సమీస్తుండడంతో గ్రామాల్లో అభ్యర్థులు ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి జోరందుకుంది. అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూనే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఫ్యాన్‌కు ఓటు వేసి విజయాన్ని అందించాలని కోరుతున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మండలంలోని కొవ్వూరులో జెడ్పీటీసీ అభ్యర్థిని గోపుశెట్టి పద్మజ బాబ్జీ, ఎంపీటీసీ–1 దేవిశెట్టి శారదాదేవి, ఎంపీటీసీ– 2 సాధనాల సత్తిబాబుకు మద్దతుగా తారకరామనగర్‌లో ఇంటింటికీ వెళ్లి అనంతరం గ్రామంలో వాహనంపై నుంచి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పిల్లి చక్రరావు, పబ్బినీడి రమేష్, పల్లం రాజు, ఊబా శ్రీను, మల్లేశ్వరరావు, బుచ్చిరాజు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పార్టీ మాజీ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, మాజీ మేయర్ సరోజ, మాకినీడి శేషుకుమారి, రావూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తిమ్మాపురంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ అభ్యర్థిని గోపుశెట్టి పద్మజ బాబ్జీ, ఎంపీటీసీ అభ్యర్థులు పెదపాటి రామారావు, సారిపల్లి గంగాభవాని గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత జగనన్న ఆశీస్సులతో పార్టీ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు బలపరిచిన తమకు ఓటు వేసి విజయం అందించాలని కోరారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda | బ్యాంక్ ఆఫ్ బరోడా | కరప బ్రాంచి

కరప మెయిన్ రోడ్డు, కరప-533462, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0884-2394889. Email: vjkaeg@bankofbaroda.bank.in

స్థిరాస్తి విక్రయం కొరకు అమ్మకం నోటీసు

అనుబంధం-IV-ఎ (రూల్ 6(2) & 8(6) చూడవలెను)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తిరిగి వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏది ఉన్నదో", "అది ఎలా ఉన్నదో అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అస్సెట్స్/లు/బకాయిలు/రిజర్వ్ ధర /ఈ-వేలం తేదీ & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

1 **ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా:** మెస్సర్స్ వీరభద్ర సాఫ్ట్ డ్రింక్స్, ప్రొప్రయిటర్: కుమారి తోటకూర అశ్విని శ్రీ దుర్గ, తండ్రి: శ్రీ టి శ్రీను బాబు, 3-24/బి, భువనేశ్వరి గుడి వీధి, కొవ్వూరు విటిసి, తూర్పు గోదావరి జిల్లా- 533016. **2. శ్రీమతి తోటకూర విజయ శాంతి (హామీదారు)**, భర్త: శ్రీ టి శ్రీను బాబు, 3-24/బి, భువనేశ్వరి గుడి వీధి, కొవ్వూరు విటిసి, తూర్పు గోదావరి జిల్లా-533016. **బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తం బకాయి: 28.07.2025 నాటికి రూ. 20,05,112.98** (అక్షరాలా ఇరవై లక్షల ఐదు వేల నూట పన్నెండు రూపాయలు మరియు తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు **01.07.2025** నుండి వసూలు అయ్యే వరకు దానిపై వడ్డీ మరియు ఏవైనా ఛార్జీలు ఉంటే వాటితో కలిపి.

స్థిరాస్తి యొక్క వివరములు

తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీ, రేపూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామంలో గల టి.ఎస్. నెం. 7/8 లో ఉన్న అసెస్‌మెంట్ నెం. 334, పాత నెం. 3-48/5, కొత్త నెం. 3-48/6 గల జి+1 ఆర్.సి.సి రూఫ్ భవనంతో కూడిన 100 చదరపు గజాలు విస్తీర్ణం గల స్థలం. **హద్దులు: తూర్పు:** పెండెం పార్వతి గారి ఆస్తి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** మెయిన్ రోడ్డు, **దక్షిణం:** తాతంశెట్టి రాంబాబు గారి ఆస్తి.

రిజర్వు ధర	ధరావత్తు	బిడ్ పెంపుదల
రూ. 21,48,000/-	రూ. 2,14,800/-	రూ. 25,000/-

ఈ-వేలం తేది & సమయం: 16-11-2026, మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు

వేలం ముగిసే వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక్కసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: 13-11-2026, సా॥ 4.00 గం॥ల వరకు (ముందస్తు అపాయింట్‌మెంట్‌తో మాత్రమే)

అమ్మకం యొక్క పూర్తి నియమ నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్‌సైట్ లింక్: **https://bankofbaroda.bank.in/e-auction** మరియు ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ **https://baanknet.com** నందు చూడగలరు. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క ఫోన్ నెం. **0884-2394889**, మొబైల్ నెం. **9010505885** నందు సంప్రదించవచ్చును.

తేది: 30.10.2026, ప్రదేశం: కరప — అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బి.సురేష్‌బాబు ACM - 9885944997
వి.వి.భద్రరావు CO (కాకినాడ) - 6300362485
జి.సతీష్, జూ॥ ఆఫీసర్ - 9640358278
టోల్ ఫ్రీ నెం. 1800 2125 9899